క్లుప్తంగా

ఫ్యాన్ల వితరణ



ఫ్యాన్లు అందజేస్తున్న దాతలు

రాజాం: మున్సిపాలిటీ పరిధిలోని కొండంపేట అనాథ వృద్ధాశ్రమానికి రెండు ఫ్యాన్లను దాతలు వితరణ చేశారు. తెర్లాం మండలంలోని బూరిపేటకు చెందిన సర్పంచ్ బూరి మధుసూదనరావు వాటిని నిర్వాహకులకు ఆదివారం అందజేశారు. దాలయ్య, దివ్యల వర్ధంతి సందర్భంగా వారి జ్ఞాపకార్థం వాటిని అందించినట్లు ఆయన తెలిపారు. అనంతరం ఆశ్రమంలోని వృద్ధులకు భోజనం ఏర్పాటు చేశారు.

క్రీడాపోటీలు

బొబ్బిలి: యూటీఎఫ్ స్వర్ణోత్సవాల్లో భాగంగా స్థానిక పట్టణంలోని క్రీడా ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన పలు క్రీడాపోటీలు ఉల్లాసంగా ఉత్సాహంగా కొనసాగాయి. షాట్‌పుట్ క్రీడలో శంబంగి నాగేశ్వరరావు, మండల రమేష్, గర్భాపు అనిల్‌లు, క్రికెట్‌లో ఆనెం శ్రీను అవెంజర్స్ జట్టు విజేతలుగా నిలిచారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.విజయగౌరి, కె.కృష్ణదాసు తదితరులు పాల్గొన్నారు.

రాఖీ వేడుకలు ప్రారంభం



రాఖీలు ఆవిష్కరిస్తున్న బ్రహ్మకుమారీలు, కౌన్సిలర్ శరత్, తదితరులు

బొబ్బిలి: స్థానిక ఓంశాంతి బ్రహ్మకుమారీస్ సేవా కేంద్రంలో రాఖీ వేడుకలు ఆదివారం ప్రారంభమయ్యాయి. మౌంట్ ఆబూ నుంచి దాదీజీ పంపించిన రాఖీలను కేంద్రం ఇన్‌చార్జి రాజేశ్వరి, కౌన్సిలర్ రాంబార్కి శరత్ చేతులమీదుగా రాఖీలు ఆవిష్కరించారు. ఈ నెల 19వ తేదీ వరకు ఈ ఉత్సవాలు జరుగుతాయని, నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోని ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి, అక్కడి అధికారులకు రాఖీలు కట్టి, రక్షాబంధన్ గొప్పతనం వివరించనున్నట్లు వారు తెలిపా.

లక్ష కుంకుమార్చన



పూజల్లో పాల్గొన్న మహిళలు

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలోని గాయత్రికాలనీలో కొలువైన వేదమాత గాయత్రి ఆలయంలో లక్ష కుంకుమార్చన ఆదివారం చేపట్టారు. కాలనీవాసులతో పాటు కొత్తవలస, మెంటిపేట, రాజాం, పెనుబాక ప్రాంతాలకు చెందిన మహిళలు అధిక సంఖ్యలో ఈ పూజల్లో పాల్గొన్నారు. అష్టైశ్వర్యాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లేలా చూడాలని వేడుకున్నారు.

ఎస్సీ వ్యతిరేక విధానాలు విడనాడాలి



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన చేపడుతున్న ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి సభ్యులు

విజయనగరం: దేశ అత్యున్నత న్యాయస్థానం ఆగస్టు ఒకటో తేదీన వెలువరించిన ఎస్సీ, ఎస్టీ ఉప వర్గీకరణను ఆంధ్రప్రదేశ్‌లో పాలన సాగిస్తున్న కూటమి ప్రభుత్వం సమర్థించాలని, లేని పక్షంలో తగిన మూల్యం చెల్లించుకోకతప్పదని ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి ప్రతినిధి బొంగ భానుమూర్తి స్పష్టం చేశారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆర్టికల్ 341ను సవరించే అధికారం పార్లమెంటుకు మాత్రమే ఉందని.. రాష్ట్రానికి లేదని పేర్కొన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడిన ప్రతిసారీ ఎస్సీల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి విఘాతం కలిగిస్తోందన్నారు. ఇటువంటి చర్యలను తక్షణమే విడనాడాలని హెచ్చరించారు. కార్యక్రమంలో పలువురు సమితి సభ్యులు పాల్గొన్నారు.

'డ్రమ్ సీడింగ్'పై అవగాహన

నెల్లిమర్ల రూరల్: మండలంలో తంగుడుబిల్లిలో డ్రమ్ సీడింగ్ విధానంపై రైతులకు ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రెడ్డీస్ ఫౌండేషన్ మండల సమన్వయకర్త రెడ్డి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. డ్రమ్ సీడింగ్ పద్ధతితో ఎకరాకు రూ.6 వేల వరకు పెట్టుబడి తగ్గుతుందన్నారు. అన్నదాతలు ఈ విధానంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు చందక చిన్నంనాయుడు, గ్రామపెద్దలు, రైతులు పాల్గొన్నారు.

'లవ్ రీడింగ్'కు స్పందన

డెంకాడ: మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన లవ్ రీడింగ్ కార్యక్రమానికి స్పందన లభించింది. కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు పలు రకాల కథల పుస్తకాలు చదివారు. క్యారమ్స్, స్నేక్స్ అండ్ ల్యాడర్ వంటి ఇండోర్ గేమ్స్ కూడా ఆడారు. విద్యార్థులకు లైబ్రేరియన్ మహేష్ బిస్కెట్‌లను అందించారు.

- కళ్లెదుటే నీళ్లున్నా.. తీరని సాగునీటి కష్టాలు
- అధ్వానంగా మడకవాని చెరువు ప్రధాన మదుములు
- వెంకయ్యబంద చెరువు తూములదీ అదే పరిస్థితి
- వ్యర్థాలు, చిల్లచెట్లతో నిండిన సాగునీటి కాలువలు
- రెండు చెరువుల కింద 200 ఎకరాల ఆయకట్టు
- మదుములు బాగుచేయాలని కోరుతున్న రైతాంగం



మడకవాని చెరువు మదుము గోడ కూలిపోవడంతో పాటు సాగునీటి ప్రవేశ ద్వారం పూర్తిగా పూడ్చుకుపోయిన దృశ్యం



వ్యర్థాలతో నిండిన కూరాకుల చెరువు చప్టా, సాగునీటి కాలువ



బొబ్బిలి రోడ్డు పక్కనే వ్యర్థాలతో నిండిన పంట కాలువ

నీరెళ్లే దారేది..?

రామభద్రపురం: దేవుడు కరుణించినా.. పూజారి కరుణించలేదనే చందంగా తయారైంది మండలంలోని పలు చెరువుల ఆయకట్టు రైతుల పరిస్థితి. ప్రస్తుతం అడపాదడపా కురుస్తున్న వర్షాలతో చెరువులు నిండినా కొన్ని చెరువులకు సంబంధించిన ఆయకట్టు పొలాలు పండేలా కనిపించడం లేదు. దీంతో బాధిత రైతులంతా లబోదిబోమంటున్నారు. సాగునీరు వెళ్లేందుకు మార్గం సుగమం చేయాలని అభ్యర్థిస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి.. రామభద్రపురం మండల కేంద్రంలోని మడకవాని చెరువు ఆయకట్టు కింది పొలాలకు సాగునీరందించే రెండు మదుములు(తూములు) చాలా అధ్వానంగా తయారయ్యాయి. చెరువులోని నీటి మదుముల గోడలు పూర్తిగా పడిపోవడంతో పాటు వాటి ద్వారా నీరు వచ్చే ప్రవేశాలు(రంధ్రాలు) పూడ్చుకుపోవడంతో పొలాలకు సాగునీరు అందడం లేదు. గత ఏడేళ్లుగా ఇదే పరిస్థితి అయినా పట్టించుకునే నాథుడే లేడని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మడకవాని చెరువు కింద ఉన్న వెంకయ్యబంద చెరువు మదుములదీ ఇదే దుస్థితి. ఆయా చెరువుల నుంచి దాదాపు 200 ఎకరాలకు ఆ పాడైపోయిన మదుముల ద్వారానే సాగునీరు చేరాల్సి ఉంది. ఇప్పుడు మదుములున్న పరిస్థితి చూస్తే నీళ్ల ముందుకెళ్లే పరిస్థితి కనిపించడం లేదు.

5 నుంచి 6 అడుగుల లోతు..

ఇదిలా ఉంటే కూరాకులవాని చెరువులోని నీటిని చప్టా, మదుముల ద్వారా రామభద్రపురం గ్రామ సమీపంలోని పంటపొలాల మీదుగా మడకవాని చెరువుకు చేరుస్తూ నీటితో కళకళలాడాల్సిన కాలువలు నేడు మురుగుకాలువలను తలపిస్తున్నాయి. 5 నుంచి 6 అడుగుల లోతులో ఉండాల్సిన ఆ కాలువలు పూర్తిగా చెత్తాచెదారం, వ్యర్థాలు, పూడికలు, పిచ్చిమొక్కలతో నిండిపోయాయి. చొక్కాపు వీధి దగ్గరలో బొబ్బిలి వెళ్లే రోడ్డు పక్కన ఉన్న సాగునీటి కాలువ కూడా వ్యర్థాలతో నిండిపోయింది. కనీసం చుక్కనీరు కూడా వెళ్లేందుకు మార్గం లేదు. గ్రామంలోని వారంతా గృహావసర వ్యర్థాలను ఆ కాలువలో వేయడం వల్లే ఈ పరిస్థితి అని స్థానికులు చెబుతున్నారు. ఈ సమస్యలపై ఇరిగేషన్, పంచాయతీ అధికారులను కలిసినా ప్రయోజనం లేదని, మొక్కుబడిగా చూసి వెళ్తున్నారే తప్ప చర్యలు శూన్యమంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

తక్షణమే మదుములు బాగుచేయాలి..

మడకవాని చెరువు రెండు మదుములు పూర్తిగా కుంగిపోయి పాడైపోయాయి. తక్షణమే ఆ మదుములను బాగుచేసి, సాగునీటి సరఫరాకు అడ్డంకులు తొలగించాలి. ఉపాధి హామీ పథకం పనులనైనా ఈ మదుముల మరమ్మతులకు వినియోగిస్తే ప్రయోజనముంటుంది.

–చొక్కాపు చిన్నంనాయుడు, రైతు, రామభద్రపురం

అంచనాలు రూపొందించి, పంపించాం

మడకవాని చెరువు మదుములు బాగుచేయడానికి అంచనాలు రూపొందించి, ఉన్నతాధికారులకు పంపించాం. పనులకు సంబంధించి, నిధుల మంజూరు, అనుమతులు వచ్చిన వెంటనే పనులు చేపడతాం. –హరికృష్ణ, ఇరిగేషన్ ఏఈ, రామభద్రపురం మండలం

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత



భగవద్గీత గొప్పతనం వివరిస్తున్న ఆధ్యాత్మిక వక్త రమణ

రేగిడి: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత సాధ్యమని పాలకొండకు చెందిన ఆధ్యాత్మిక వక్త ఎన్వీ రమణ అన్నారు. మండలంలోని దేవుదల గీతామందిరంలో గొర్లె దామోదరరావు ఆధ్వర్యంలో దివ్యజీవన సత్సంగ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భగవద్గీత మోక్ష ప్రదాయిని అని, భగవద్గీతను పఠిస్తే చెడుగీతలు చెరిగి పోతాయన్నారు. ప్రస్తుత కాలంలో ప్రతిఒక్కరూ బిజీ జీవితంలో పడి మానసిక ప్రశాంతత కోల్పోతున్నారని, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా మనసు ప్రశాంతంగా ఉంటుందన్నారు. ప్రతిఒక్కరూ కొంత సమయాన్ని దైవ కార్యక్రమాలకు కేటాయించాలన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మోహన్‌దాస్, అప్పలరాం, నిత్య స్మరణానందస్వామి, ఎం.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



కృష్ణమూర్తిని పరామర్శిస్తున్న డాక్టర్ తలే రాజేష్

రాజాం సిటీ: పట్టణంలోని అమ్మవారి కాలనీకి చెందిన పల్యాల శ్రీనివాసరావు తల్లి సరోజిని, డోలపేటకు చెందిన గొట్టాపు కృష్ణమూర్తి తల్లి పార్వతమ్మలు ఇటీవల మృతి చెందారు. ఈ మేరకు ఆయా కుటుంబాలను వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ తలే రాజేష్ ఆదివారం కలిసి, పరామర్శించారు. ఆయన వెంట పార్టీ టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, నాయకులు పాలవలస శ్యాంసుందర్, సలాది సతీష్, పాలవలస రమేష్, డాక్టర్ బి.నరేంద్ర తదితరులు ఉన్నారు.

సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షించుకోవాలి

బొబ్బిలి రూరల్: హిందూ సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షించుకోవాలని రాష్ట్ర సాదుసంత్ అధ్యక్షులు శ్రీనివాసానంద సరస్వతి కోరారు. మండలంలోని నారసింహునిపేట ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం జరిగిన పూర్ణకలశ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి హాజరైన ఆయన భక్తులను ఉద్దేశించి, కాసేపు ప్రసంగించారు. బలవంతపు మతమార్పిడిలతో సమాజానికి చాలా ప్రమాదకరమన్నారు. మతం మారడమంటే మన సంస్కృతిని మనం నాశనం చేసుకున్నట్లేనన్నారు. హిందూ మత ఔన్నత్యాన్ని అందరూ తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో పురోహితులు కె.సూర్యశర్మ, సమరసత సేవా ఫౌండేషన్ డివిజన్ ప్రచారకులు దూపం వాసు పాల్గొన్నారు.

రిజర్వేషన్లను కాపాడుకోవాలి..

విజయనగరం ఫోర్ట్: మాలలంతా ఏకమై రిజర్వేషన్లను కాపాడుకోవాలని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు లోగిశ రామకృష్ణ అన్నారు. నగరంలోని మాల మహానాడు కార్యాలయంలో మాల మృతవీరుల సంస్మరణ దినం ఆదివారం నిర్వహించారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేయడంతో పాటు మాల మృతవీరుల చిత్రాల వద్ద కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. అనంతరం రామకృష్ణ మాట్లాడుతూ.. 1997 ఆగస్టు 11న హలో మాల – చలో అసెంబ్లీ కార్యక్రమం చేపట్టగా లక్షలాది మంది వచ్చారన్నారు. మాలలంతా లక్షలాదిగా హైదరాబాద్ చేరుకోవడంతో బషీరాబాగ్ ప్రెస్‌క్లబ్ వద్ద పోలీసులు ఇనుప ముళ్ల కంచెలు వేసి అడ్డుకున్నారని గుర్తు చేశారు. వాటిని దాటుకుని వెళ్లిన వారిపై భాష్పవాయువు ప్రయోగించి, గుర్రాలతో తొక్కించారని తెలిపారు. అప్పటకీ మాలలు ఆగకపోవడంతో పోలీసులు జరపడంతో నలుగురు మృతి చెందగా.. వేలాది మంది తీవ్రంగా గాయపడ్డారన్నారు. అప్పటినుంచి ప్రతి ఏడాదీ ఆగస్టు 11న మాల మృతవీరుల సంస్మరణ దినం జరుపుకుంటున్నట్లు చెప్పారు. తాజాగా సుప్రీంకోర్టు ఆదేశాలతో మళ్లీ ఎస్సీ వర్గీకరణ అంశం తెరమీదకు వచ్చిందన్నారు. వర్గీకరణ రాష్ట్రంలో అమలు కాకుండా మాలలంతా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు చోళ్ల సింహాచలం, మైలపల్లి నాగరాజు, ఎస్.ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్లను సద్వినియోగం చేసుకోండి



డ్రోన్ సహాయంతో పురుగుమందు పిచికారీ చేయిస్తున్న దృశ్యం

రేగిడి: చెరకు పంటపై పురుగుమందుల పిచికారీకి డ్రోన్లను సద్వినియోగం చేసుకోవాలని సంకిలి ఈఐడీ ప్యారీ సుగర్ ఫ్యాక్టరీ కేన్ డీజీఎం ఎం.రమేష్ కోరారు. మండలంలోని వెంకటాపురం గ్రామ పొలాల్లోని చెరకు పంటపై డ్రోన్లతో పురుగుమందు పిచికారీని ఆదివారం చేపట్టారు. ఇలా డ్రోన్ల సహాయంతో మందులు పిచికారీ చేయడం ద్వారా తక్కువ కాలంలో ఎక్కువ విస్తీర్ణంలోని పంటకు మందులు చల్లవచ్చని తెలిపారు. కార్యక్రమంలో కింజరాపు సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దేశ నాయకుల గొప్పతనం తెలుసుకోవాలి



విద్యార్థినికి బహుమతి అందిస్తున్న వికాస తరంగిణి సభ్యులు

రాజాం సిటీ: పాఠశాల స్థాయి నుంచే దేశ నాయకుల గొప్పతనాన్ని విద్యార్థులు తెలుసుకోవాలని వికాస తరంగిణి సెంట్రల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి టీటీవీ రమణమూర్తి అన్నారు. స్థానిక వికాస తరంగిణి కార్యాలయంలో 'స్వాతంత్య్ర పోరాటంలో భగత్‌సింగ్ పాత్ర' అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దేశం కోసం త్యాగం చేసిన గొప్ప గొప్ప నాయకులు ఎందరో ఉన్నారని, వారి జీవిత చరిత్రలు తప్పనిసరిగా తెలుసుకుని, స్ఫూర్తి పొందాలన్నారు. నియోజకవర్గ స్థాయిలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సంబంధించి పోటీలు నిర్వహించామన్నారు. ప్రభుత్వ పాఠశాలల విభాగంలో మందరాడ జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన పైల రబీనా ప్రథమ, రాజాం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన అడపా హర్షిత ద్వితీయ, మందరాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ముంజేటి లహరి తృతీయ స్థానం సాధించారన్నారు. ప్రైవేటు పాఠశాలల విభాగంలో బూరి జోషిక(సన్ స్కూల్), వావిలపల్లి గ్లోరి(బ్రిలియంట్ స్టార్ పబ్లిక్ స్కూల్), కె.జోష్ణప్రియా (జ్ఞానసరస్వతి విద్యాలయం)లు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచి బహుమతులు పొందారన్నారు. ఈ కార్యక్రమానికి న్యాయనిర్ణేతలుగా మీగడ విశ్వేశ్వరరావు, మూడడ్ల శ్రీనివాసరావు, గెడ్డాపు శ్రీలక్ష్మిలు వ్యవహరించగా, వికాస తరంగిణి సభ్యులు వాకచర్ల పైడిరాజు, గడే అప్పలనాయుడులు విజేతలకు బహుమతులు అందించారన్నారు.

పశువుల సంచారంతో ఇబ్బందులు



రాజాం మెయిన్‌రోడ్డులో గుంపులు గుంపులుగా సంచరిస్తున్న పశువులు

రాజాం సిటీ: పట్టణంలోని రోడ్లపై విచ్చలవిడిగా తిరిగే పశువులతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అకస్మాత్తుగా వాహనాలకు అడ్డుగా రావడంతో పాటు ఒక్కోసారి వాహనదారుడి మీదికి కూడా దాడికి వచ్చేస్తున్నాయని వాపోతున్నారు. మెయిన్ రోడ్డుతో పాటు చీపురుపల్లి రోడ్డు, బొబ్బిలి రోడ్డు, పాలకొండ రోడ్లపై ఎక్కువగా రాత్రి సమయాల్లో పశువుల సంచారం ఎక్కువగా ఉంటోందని చెబుతున్నారు. గతంలో ఇదే విషయమై ఫిర్యాదులు వెళితే మున్సిపల్ అధికారులు స్పందించి, పెంపకందారులకు హెచ్చరికలు జారీ చేశారు. అయినా మళ్లీ ఎప్పటిలాగే మూగజీవాలు సంచరిస్తుండడంతో వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రహదారికి పచ్చని మణిహారం



టొంపలపేట వద్ద రోడ్డుకిరువైపులా పచ్చగా కనిపిస్తున్న మొక్కలు

నెల్లిమర్ల రూరల్:

నెల్లిమర్ల – రణస్థలం ప్రధాన రహదారిలో స్థానిక టొంపలపేట వద్ద రోడ్డుకిరువైలా నాటిన మొక్కలు పచ్చగా సుందరంగా దర్శనమిస్తున్నాయి. ఉపాధి హామీ పథకం కింద కొన్నేళ్ల కిందట టొంపలపేట నుంచి గొర్లిపేట వరకు రోడ్డుకిరువైపులా మొక్కలు నాటారు. టొంపలపేట గ్రామస్తులు మొక్కలను సంరక్షించడంతో సుమారు 800 మీటర్ల వరకు రోడ్డుకిరువైపులా మొక్కలు ఏపుగా పెరిగాయి. పచ్చని మొక్కలు ప్రకృతి ప్రేమికులను ఎంతగానో ఆకర్షిస్తున్నాయి.

పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి



తెర్లాం: విద్యార్థులతో పుస్తకాలు చదివిస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి

తెర్లాం: విద్యార్థులంతా ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. విద్యార్థులతో పుస్తకాలు చదివించిన ఆయన.. పుస్తకాలు చదవడం ద్వారా మంచి జ్ఞానాన్ని పొందవచ్చని తెలిపారు. పుస్తక పఠనంతో పాటు చిత్రలేఖనం, వ్యాస రచన, వక్తృత్వ పోటీల్లో కూడా తర్ఫీదు పొందాలన్నారు. విద్యార్థులంతా గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన చిల్డ్రన్స్ క్లబ్‌లో చేరాలని, ప్రతిరోజూ గ్రంథాలయానికి వచ్చి వార్తాపత్రికలు, కథల పుస్తకాలు, కాంపిటేటివ్ పుస్తకాలు, ఇతర పుస్తకాలు చదవడంపై దృష్టి సారించాలన్నారు. ఆయన వెంట నెమలాం హైస్కూల్ క్రాఫ్ట్ ఉపాధ్యాయుడు విశ్వేశ్వరరావు తదితరులు ఉన్నారు.



రామభద్రపురం: పుస్తక పఠనం ప్రయోజనాలను వివరిస్తున్న లైబ్రేరియన్ సత్యవేణి

రామభద్రపురం: స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన చదవడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో కథల పుస్తకాలను చదివించారు. పుస్తక పఠనం ద్వారా అపారమైన జ్ఞానం లభిస్తుందని, ప్రతిఒక్కరూ తప్పనిసరిగా పుస్తకాలు చదవడాన్ని అలవాటుగా చేసుకోవాలని లైబ్రేరియన్ సత్యవేణి విద్యార్థులకు సూచించారు.

14న ధర్నా



ధర్నా వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న శంకరరావు, లక్ష్మీదాసు

బొబ్బిలి: సహారా ఇండియా ఆస్తులు కొల్లగొట్టి, బాధితులను నట్టేట ముంచేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని సహారా ఇండియా బాధిత పోరాట కమిటీ జిల్లా అధ్యక్షుడు బి.లక్ష్మీదాసు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పొట్నూరు శంకరరావు ఆరోపించారు. ఇదే విషయమై వారు ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 14వ తేదీన బొబ్బిలి పట్టణంలో జరిగే ధర్నాకు సహారా ఇండియా ఖాతాదారులు హాజరుకావాలని పిలుపునిచ్చారు. దేశంలోని 13 కోట్ల మంది ఖాతాదారులతో పాటు 12 లక్షల మంది ఏజెంట్లను నిలువునా ముంచేయడానికి కేంద్రమంత్రులు అమిత్‌షా, నిర్మలాసీతారామన్‌లు చూస్తున్నారని విమర్శించారు. సహారా ఇండియాకు సంబంధించి, రూ.6 లక్షల కోట్లు ఆస్తులున్నప్పటికీ వాటిలో రూ.3 లక్షల కోట్లను ఖాతాదారులకు పంచకుండా పెద్ద కుట్ర జరుగుతోందన్నారు. బాధితులకు న్యాయం జరిగేలా తలపెట్టే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం ధర్నా వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు.

కూరగాయల సాగుపై అవగాహన



ఫార్మా మోడల్‌లో కూరగాయల సాగుపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

రేగిడి: మండలంలోని చాటాయవలస గ్రామంలో ఉన్న భవానీ స్వయంశక్తి సంఘ మహిళలకు ఫార్మా మోడల్ విధానం ద్వారా కూరగాయల సాగుపై ఆదివారం అవగాహన కల్పించారు. సంవత్సరం పొడవునా ఆకుకూరలు, కూరగాయలు ఎలా పండించాలి, తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం ఎలా సంపాదించాలన్న విషయాలను ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పార్వతమ్మ, గౌరీశ్వరరావు, తవిటినాయుడు, రమణలు వివరించారు. ప్రతిఒక్కరూ సేంద్రియ ఎరువులు వాడాలని, వీటి ద్వారా ఆరోగ్యవంతమైన పంట అధిక దిగుబడులు వస్తాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కరణం గోవిందరావు, సురేష్, రవి, గోవింద్, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.